

కాఫీ పండ్లను కిలో రూ.100కు కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ఏజెన్సీలో గిరిజనులు పండిస్తున్న కాఫీ పళ్లకు గురువారం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ ప్రకటించిన కొనుగోలు ధర కిలో కాఫీ పళ్లకు 43 రూపాయలు తమకు గిట్టుబాటు కాదని, గిరిజన రైతులు, కాఫీ ఫార్మర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ సభ్యుడు పాలికి లక్కు తెలిపారు. ఈ సందర్భంగా లక్కు మాట్లాడుతూ,కిలో కాఫీ పళ్ళు రూ.100లకు కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం ఒకవైపు అరకు కాఫీ ఎంతో ప్రాముఖ్యతమైందని ,విదేశాల్లో మంచి ధర పలుకుతుందని స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చెప్పగా ఐటిడిఏ ఆధ్వర్యంలో కిలో కాఫీ పండ్ల రేట్లను రూ.43లకు ప్రకటించడం సరికాదన్నారు. కాఫీ రైతులు కూలీలకు రోజు కూలీ రూ.300 నుండి 500 చెల్లించి సెంట్రింగ్, వీడింగ్ పనులు చేపట్టి తమ పంటను అమ్ముతుంటే ఒక కిలో పండ్లు కనీసం 50 రూపాయలు కూడా పెంచలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.కొంతమంది వ్యాపారులు ప్రస్తుతానికి రూ.50లకు కొనుగోలు చేసే వారు కూడా 7 రూపాయలు తగ్గించి కొనుగోలు చేసే అవకాశం ఉందన్నారు పళ్ళ రేటు కిలో 100లకు కొనుగోలు ధర ప్రకటించాలని చేయాలని డిమాండ్ చేశారు.

ఎర్ర జెండాతోనే ఆదివాసీ హక్కులకు రక్షణ

-ప్రజా ప్రణాళిక ఆవిష్కరణలో సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స



పాడేరులో ప్రజా ప్రణాళికను ఆవిష్కరిస్తున్న అప్పలనర్స, తదితరులు

ప్రజాశక్తి-పాడేరు: ఎర్రజెండా గెలుపు తోనే ఆదివాసీ హక్కుల రక్షణ, అభివృద్ధి సాధ్యమని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి అప్పల నర్స తెలిపారు. సిపిఎం ప్రజా ప్రణాళిక ఎన్నికల మేనిఫెస్టోను జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్. సుందర్రావు, మండల నాయకులు పి.లక్కుతో కలిసి శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జీఓ 3 రిజర్వేషన్ రద్దై నేటికి 3 సంవత్సరాలు అయినప్పటికీ, నేటికీ ప్రభుత్వం చట్టబద్ధత కల్పించలేదని విమర్శించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం రాజ్యాంగ సవరణ చేసి 5 షెడ్యూల్ క్లాజ్ 2 ప్రకారం స్థానిక ఆదివాసీలకు నూరు శాతం రిజర్వేషన్ కల్పించి వచ్చిన గిరిజన సలహా మండలి (టి.ఎ.సి) తీర్మానం చేసినా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ కనీసం బాధ్యతగా వ్యవహరించి, అసెంబ్లీ లో తీర్మానం చేసి కేంద్రానికి పంపలేదన్నారు. బోయ/ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు పై అసెంబ్లీ లో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన జగన్ ప్రభుత్వం ఆదివాసి రిజర్వేషన్ పై మాత్రం చిత్త శుద్ధి లేదని విమర్శించారు. స్థానిక ప్రజా ప్రజాప్రతినిధులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కనీసం ప్రశ్నించ లేదన్నారు. బస్ యాత్ర 1న అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రవేశించి 4 రోజులు పాటు సాగి 9న విజయవాడ చేరుతుందని, నవంబర్ 15న విజయ వాడ లో జరిగే బహిరంగ సభ ను విజయ వంతం చేయాలన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీకి టీడీపీ, వైసీపీ, జనసేన పార్టీలు వంత పాడటం మానేసి రాష్ట్ర హక్కుల కోసం బీజేపీని నిలదీయాలని, లేకపోతే ఆంధ్ర రాష్ట్ర ప్రజలు తిరగబడతారన్నారు.

అరకులోయ రూరల్: బిజెపి పార్టీని గద్దె దించి ప్రజల్ని రక్షించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన చేపడుతున్న ఆ పార్టీ ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని అరకు వేలీ ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో బస్సు యాత్ర గోడ పత్రిక విడుదల చేశారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్ను తాకట్టు పెడుతున్నా నోరు మెదపని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కిండంగి రామారావు, జన్ని భగత్ రామ్, కె.బుజ్జి బాబు, పి.నానిబాబు, కె.రమేష్ ఎస్.సిటో తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: ప్రజా రక్షణ భేరి పోస్టర్ను స్థానిక గిరిజన సంఘం బవనం వద్ద జెడ్పిటిసి దీసరి .గంగరాజు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి మాట్లాడుతూ, విశాఖ ఉక్కును అమ్మేసి ఉత్తరాంధ్ర ప్రయోజనాలను దెబ్బకొడుతున్న ప్రభుత్వాలను గద్దెదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సోమేల. నాగులు, టోకురు సిపిఎం సర్పంచ్ కిల్లో.మోస్య, మండల నాయకులు జ్వెర్ల వెంకటరమణ పాల్గొన్నారు.

కూనవరం: అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం నిర్వహించనున్న ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్లను మండలంలోని మార్క్స్ శ్రీమూర్తి భవన్లో శుక్రవారం ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య, సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ పాలనలో దేశం మొత్తం అప్పు వస్తువు తయారైందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, సీనియర్ నాయకులు, నాగరాజు, శ్యామల కృష్ణ, ఆవుల మురళి, కర్నాటి శ్రీనివాసరావు, తాళ్లూరి శ్రీనివాసరావు, జ్యోతి, కుంజా రాధ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు : రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపితో ఏ ప్రతిపాదికన కలిసి పని చేయడానికి టిడిపి, జనసేన తహతహలాడుతున్నాయో రాష్ట్ర ప్రజలకు చెప్పాలని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోనంగి చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. నవంబర్ 15న విజయవాడలో జరుగుతున్న ప్రజా రక్షణ భేరి బహిరంగ సభ గోడపత్రికను కొయ్యూరు మండలం చౌనూరులో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం చింతపల్లి మండల కార్యదర్శి పాంగి ధనుంజయ, కొయ్యూరు మండల నాయకులు వై అప్పలనాయుడు, ప్రసాద్, సాన పాల్గొన్నారు.



కూనవరంలో పోస్టర్ను ఆవిష్కరిస్తున్న నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్

రంపచోడవరంలో 2.72 లక్షల ఓటర్లు

- జాబితాలో తప్పులు సవరణకు చర్యలు
- రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గంలో 399 పోలింగ్ బూతుల పరిధిలో ప్రస్తుతం 2,72,004 ఓటర్లు ఉన్నట్లు రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. శుక్రవారం తన ఛాంబర్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ సవరణ ప్రక్రియ గురించి ఆయన సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా శుభం బన్సల్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో తప్పులు సరి చేయడానికి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ నెల 20 నుండి 26వ తేదీ వరకు ఫారం 6 ద్వారా ఓటర్ల నమోదు కొరకు 34 దరఖాస్తులు, ఫారం-7 ద్వారా చనిపోయిన వారి పేర్లు తొలగింపునకు 711, ఫారం 8 ద్వారా ఓటర్ లిస్టులోని పేర్లలో తప్పులు, ఫొటోలు సరి చేయడానికి 50 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముందు రోజు వరకు ఓటర్ల జాబితాలో ఏమైనా సమస్యలుంటే సంబంధిత ఫారాల ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఓటర్ కార్డులకు ఆధార్ అనుసంధానం సుమారు 79 శాతం వరకు పూర్తయిందన్నారు. 18 సంవత్సరాల నిండిన యువతీ యువకులు ఓటర్ కార్డులకు దరఖాస్తు చేసుకునే విధంగా స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నవంబర్ నెల 4, 5 తేదీల్లోనూ, డిసెంబర్ నెలలో 2, 3 తేదీల్లోనూ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఎన్నికల పోలింగ్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఓటర్ సవరణకు సంబంధించిన వివరాలు ప్రజాప్రతినిధులకు ఎప్పటికప్పుడు సర్క్యూట్ చేస్తామన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కె.బాలకృష్ణ, ఎస్.బోజ్జిరెడ్డి, పి.శ్రీనివాసరావు, మడకం వరప్రసాద్ దొర, డిప్యూటీ తహశీల్దారు ఎన్వివి.సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్లు డి.ఇందిరాబాయి, టి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


జిల్లాలో 7,40,573 మంది ఓటర్లు

-జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వెల్లడి

ప్రజాశక్తి-పాడేరు: ఎస్ఎస్ఆర్ -2024 డ్రాఫ్ట్ పబ్లికేషన్ను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విడుదల చేసారు. ఈనెల 27వ తేదీ నాటికి జిల్లాలో 7 లక్షల 40 వేల 573 మంది ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసామని చెప్పారు. ఈ మేరకు డ్రాఫ్ట్ ప్రతులు ఉన్న సిడీలను రాజకీయ పార్టీల నేతలకు అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 28 అరకువ్యాలీ నియోజక వర్గంలో పురుషులు ఓటర్లు 113087, మహిళా ఓటర్లు 119243 మంది, థర్డ్ జెండర్లు 7గురు మొత్తం 2 లక్షల 32 వేల 337 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు.. 29 పాడేరు అసెంబ్లీ నియోజక వర్గంలో పురుష ఓటర్లు 114146 మంది, మహిళా ఓటర్లు 122071 మంది, థర్డ్ జెండర్లు 15 మంది ఓటర్లు మొత్తం 236232 మంది ఓటర్లు ఉన్నారని స్పష్టం చేసారు. 53 రంపచోడవరం అసెంబ్లీ నియోజక వర్గం పరిధిలో పురుష ఓటర్లు 129696 మంది, మహిళా ఓటర్లు 142297 మంది, థర్డ్ జెండర్లు 11 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఓటరు నమోదు, తొలగింపులపై నవంబరు 4, 5 తేదీలలోను, డిసెంబరు 2,3 తేదీలలో నాలుగు రోజులు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామన్నారు. డిసెంబరు 9వ తేదీలోపు అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. వచ్చే ఏడాది జనవరి 5వ తేదీన ఫైనల్ ఓటరు జాబితా ప్రకటిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎంఎల్ఏ గిడ్డి ఈశ్వరి, కలెక్టరేట్ పరిపాలనాధికారి చిన్ని క్రిష్ణ, వివిద రాజకీయ పార్టీల నేతలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్



శిలాఫలకం ఆవిష్కరించిన ఎస్పి తుహిన్ సిన్హా తదితరులు

పోలీస్ స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-విఆర్.పురం

ఎటపాక పోలీసు సర్కిల్ పరిధిలోని ఎటపాక, కూనవరం మండలం కోతులగుట్ట, విఆర్.పురం మండలం రేఖపల్లిలో పోలీస్స్టేషన్ల నిర్మాణానికి అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, రంపచోడవరం ఒఎస్డి, చింతూరు అదనపు ఎస్పీ కెవి.మహేశ్వరరెడ్డితో కలసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎటపాక పోలీస్ స్టేషన్ అవరణలో పోలీస్ క్రికెట్ గ్రౌండ్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ఒక్కో పోలీస్ స్టేషన్ భవనాన్ని రూ.2.4 కోట్లతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ నిర్మాణాలకు పోలీస్ హౌసింగ్ బోర్డు ద్వారా నిధులు కేటాయించినట్లు చెప్పారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎటపాక సీఐ గజేంద్ర కుమార్, ఎటపాక ఎస్సై పార్థ సారధి, కూనవరం, విఆర్.పురం ఎస్సై వెంకటేష్, పోలీస్ హౌసింగ్ బోర్డ్ ఈఈ, డిఈ, ఏఈ, కాంట్రాక్టర్ శ్రీనివాస్రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

టిడిపితోనే భవిష్యత్తుకు గ్యారంటీ

ప్రజాశక్తి-చింతపల్లి: తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ అని ఆ పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యురాలు గిడ్డి ఈశ్వరి అన్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో సమావేశమైన ఆమె మాట్లాడుతూ, ఒక్క అవకాశం అంటూ అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గడచిన నాలుగేళ్లుగా ప్రజలకు చేసింది ఏమీలేదన్నారు. నిరంకుశ, కక్షపూరిత ధోరణితో ప్రతిపక్షాల గొంతు నొక్కడమే వైకాపా ప్రభుత్వం పరిపాలన సాగుతుందన్నారు. నిరాధారమైన ఆరోపణలతో కక్ష పూరితంగా తెదేపా జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడును అన్యాయంగా అరెస్టు చేసిందని విమర్శించారు.రాబోవు సార్వత్రిక ఎన్నికలలో వైకాపాను ఇంటికి సాగనంపేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని ఆమె జోష్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, చింతపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్, నాయకులు భీమన్న, మంగు, రమణ, ప్రహ్లాదు పాల్గొన్నారు.

డిఎం అండ్ హెచ్ఓ మానవత్వం

- ఘటనా స్థలంలో ప్రమాద బాధితులకు వైద్యం, ఆసుపత్రికి తరలింపు

ప్రజాశక్తి-పాడేరు: అరకులో శుక్రవారం జరిగిన స్పందన కార్యక్రమంలో పాల్గొని అరకు నుంచి ప్రధాన కేంద్రం పాడేరుకు తిరుగు ప్రయాణమైన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సి జమాల్ బాషా వస్తున్నారు. అదే సమయంలో రోడ్డు ప్రమాదానికి గురై నిస్సహాయులుగా పొదలలో పడి వున్న క్షతగాత్రులను గమనించారు. సహజంగానే వైద్య వృత్తిలో ఉన్నప్పటికీ జమాల్ బాషా మానవత్వం ప్రదర్శించి, తన వాహనాన్ని ఆపి వారికి ప్రాథమిక చికిత్స అందించి 108 కు కాల్ చేసి బాధితులను అరకు ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారితో పాటు డిఎంహెచ్ఓ కూడా తిరిగి వెనుక వచ్చి ఏరియా ఆసుపత్రి డ్యూటీ డాక్టర్, ఎముకల వ్యాధి నిపుణులుతో మాటాడి తగు వైద్య సౌఖర్యం కల్పించారు. ఈ ఘటనకు సబంధించి వివరాలు.. డుంబ్రిగూడ దగ్గరలో కురిడి గ్రామ పరిసరాల్లో గుర్తు తెలియని వాహనం మోటారు సైకిల్ పై వెళ్తున్న ఒక కుటుంబాన్ని గుద్ది ఆగకుండా ఓ వాహనం వెళ్లి పోయింది. దీంతో మోటారు సైకిల్ పై ప్రయాణిస్తున్న వారు పక్కన ఉన్న పొదలలోకి తుళ్ళిపోయారు. వీరు హుకుంపేట మండలంలోని పెదగరవు పంచాయతీ మత్స్యపురంకు చెందిన వారిగా గుర్తించారు.



108కి పోన్ చేస్తున్న భాషా

వారపు సంతలో ప్రచారం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఆమ్ ఆద్మీ పార్టీ అమలు చేస్తున్న విధి విధానాలపై మండలంలోని అరకు వారపు సంతలో శుక్రవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు సాల్మన్ సుజాత ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం కోసం ఆమ్ ఆద్మీ పార్టీ పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలి

- ఎంపిపి కారం లక్ష్మి
- ఎండిపోయిన పొలాలు పరిశీలన



ఎండిపోయిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి లక్ష్మి, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- విఆర్.పురం

తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో విఆర్.పురం మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఎంపిపి కారం లక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని ములకనపల్లి పంచాయతీ పరిధి జల్లివారి గూడెం, ములకనపల్లి గ్రామాల్లో ఎండిపోయిన పొలాలను ఎంపీపీ కారం లక్ష్మితో పాటు సిపిఎం నాయకులు శుక్రవారం పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపిపి లక్ష్మి మాట్లాడుతూ జులై, ఆగస్టు నెలల్లో భారీ వర్షాలు కురిసి, వరదలు వచ్చాయని, ఆ తర్వాత పంటలు వేసే సమయంలో వర్షాల్లేక వేసిన వరి, మినుము, పెసర తదితర పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటను రక్షించుకోవడానికి సాగునీటి కోసం అప్పులు చేయాల్సి వస్తుందని వాపోయారు. వ్యవసాయశాఖ అధికారులు పంట పొలాలను పరిశీలించి ఎకరాకు రూ.ప30వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, విఆర్.పురం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి పేద రైతులకు పూర్తి సబ్సిడీతో కూడిన వ్యవసాయ పరికరాలు, బోర్లు, విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, స్థానిక సర్పంచ్ సవల మారయ్య, సిపిఎం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఎండిపోయిన పొలాలు పరిశీలన

చింతూరు : మండలంలోని తులసిపాక, లక్కవరం, సిరసనపల్లి గోడ్లగూడం గ్రామాల్లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగునీరు లేక ఎండిపోతున్న వరి, జొన్న, నువ్వులు తదితర పంటలను సిపిఎం మండల కమిటీ సభ్యులు మడకం చిన్నయ్య ఆధ్వర్యంలో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నయ్య మాట్లాడుతూ వర్షాభావం వల్ల పంటకు నష్టం జరిగిందని, పంట మొత్తం ఎండిపోయి పశుగ్రాసంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సోకిలేరు, చంద్రవంక, సీలేరు, శబరి వంటి నదులున్నా రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి, ప్రతి గ్రామంలో ప్రభుత్వం సచివాలయ పరిధిలో పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు పంట నష్టపరిహారం అందించాలని, సోకిలేరు నదిపై మినీ డ్యాం ఏర్పాటు చేయాలని, లిఫ్ట్ ఇరిగేషన్, మోటర్లకు రిపేర్లు చేయించాలని, చెరువుల్లో పూడికలు తీయించి, కాలువలకు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కళుముల మల్లేష్, వీరయ్య పుసం, మోట బుజ్జి, మడివి పెంటయ్య, రమేష్, రాములమ్మ, మోట కన్నారావు, సోడే ముత్తయ్య, మడివి అశోక్, గొంది వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



నీరులేక ఎండిపోతున్న వరి పలాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నేతలు, రైతులు

61 కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-సీలేరు

అక్రమంగా తరలిస్తున్న 61 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకొని, ఇద్దరు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. స్థానిక ఎస్సై రామకృష్ణ కథనం ప్రకారం... గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్టు ముందస్తు సమాచారం మేరకు టిఆర్సి క్యాంప్ జంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. అటుగా వచ్చిన ఐచర్ వ్యాన్ను నిలుపుదల చేసి తనిఖీ చేయగా అందులో 61 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆ వ్యాన్లో ఉన్న మహారాష్ట్రకు చెందిన డ్రైవర్ అజిత్ సుఖదేవ్, పసుపు లంక గ్రామానికి చెందిన పప్పుల ప్రభాకర్ ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. 61 కేజీ గంజాయిని స్వాధీనం చేసుకొని వ్యాన్ను పోలీసు స్టేషన్కు తరలించారు. గంజాయి అక్రమ రవాణాలో ఇద్దరు సూత్రధారులు తప్పించుకున్నారని, వారిపై కూడా కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వ్యాన్ను సీజ్ చేసి, నిందితులను రిమాండ్కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జె.రామకృష్ణ మాట్లాడుతూ సీలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంతకుముందు గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన ఆరుగురు నిందితులపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించామని తెలిపారు.



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ చైతన్య

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని వీరాపురం గ్రామంలో మోసం చంద్రరావు అనే గిరిజనుడి పొలంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పూడికతీత పనులను చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్య శుక్రవారం పరిశీలించారు. ఉపాధి కూలీలతో పిఒ మాట్లాడారు. అడిగిన వెంటనే అధికారులు పని కల్పిస్తున్నారా? పనిచేసిన వారానికి రావలసిన వేతనాలు సకాలంలో అందుతున్నాయా? ప్రభుత్వ కార్యాలయాలకు ఏదైనా సహాయం కోసం సంప్రదించినప్పుడు సంబంధిత అధికారులు అందుబాటులో ఉంటున్నారా? అడిగి తెలుసుకున్నారు. చింతూరు క్లస్టర్ పరిధిలోని అన్ని మండలాలలో నమోదైన ఉపాధి కూలీల కుటుంబాలన్నింటికీ కచ్చితంగా 100 రోజుల ఉపాధి కల్పించాలని అధికారులను పిఒ ఆదేశించారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టాదారులకు 150 రోజులు పని కల్పించే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఇజిఎస్ క్లస్టర్ ఏపీడి, ఎంపీడీవో రవి, ఏపీవో శ్యామ్ రాజు పాల్గొన్నారు.

తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : వరి పంటకు ఆశించే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి డి.ఉమాదేవి సూచించారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో వరికి సుడిదోమ పోటు అధికంగా ఉందన్నారు. రసాయన ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని సూచించారు. పొట్ట దశలో ఉన్న పంటపై సప్తధాన్యంకరి కషాయం పిచికారీ చేయాలన్నారు. జిల్లేడు ద్రావణాన్ని వరి దుబ్బులు తడిచే విధంగా చల్లాలని కోరారు. పురుగు ఉధృతి అధికంగా ఉంటే అగ్ని అస్త్రం పిచికారీ చేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలోని తోటలూరు సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడ్డాడు. పిట్టచలం గ్రామానికి చెందిన చిన్నబ్బాయి బైక్పై కేడీపేట నుంచి తమ స్వగ్రామానికి వస్తుండగా తోటలూరు సమీపంలో అదుపుతప్పి బోల్తా పడడంతో ప్రమాదం జరిగింది. వెంటనే గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని కేడీపేట పీహెచ్సీకి తరలించారు. జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో హెచ్చరిక బోర్డులు పెట్టకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు అంటున్నారు.

వికలాంగునికి ట్రై సైకిల్ అందజేత



ట్రై సైకిల్‌ను అందజేస్తున్న పాత్రికేయులు

ప్రజాశక్తి-చింతపల్లి: అరకు పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి, నేను సైతం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ శివప్రసాద్ దంపతుల ఉదారతతో వికలాంగునికి ట్రై సైకిల్ (మూడు చక్రాల సైకిల్) వితరణగా అందజేశారు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని రింతాడ పంచాయితీ కడుగుల గ్రామానికి చెందిన వికలాంగుడు కామేశ్వరరావు వినియోగించే ట్రై సైకిల్ (3 చక్రాల సైకిల్) శిథిలావస్థకు చేరడంతో ఆయన పడుతున్న ఇబ్బందిని చింతపల్లి ప్రెస్ క్లబ్ పాత్రికేయులు గుర్తించి విషయాన్ని శివప్రసాద్ దృష్టికి తీసుకు వెళ్లారు. స్పందించిన ఆయన వికలాంగునికి ఉపయోగపడే మూడు చక్రాల రిక్షాను స్థానిక పాత్రికేయుడు చల్ల రాజు ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్ క్లబ్ కు రిక్షాను అందజేశారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సతీష్, జిల్లా కార్యదర్శి వనరాజు, సభ్యుల చేతుల మీదుగా కామేశ్వరరావుకు ట్రై సైకిల్ ను అందజేశారు.

కొత్తగా ఏడు పోలింగ్ కేంద్రాలు

- జిల్లా జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాసు

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు నియోజకవర్గం పరిధిలో అదనంగా ఏడు కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సంయుక్త కలెక్టర్, ఆ నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి జె. శివశ్రీనివాసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు, ఓటర్లకు అందుబాటులో ప్రస్తుతం ఉన్న దూరం తగ్గే విధంగా ఏర్పాటు చేసిన ఈ ఏడు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఆమోదించిందని జెసి వివరించారు. పాడేరు మండలంలో వంట్లమామిడి పంచాయతీ కొత్త పోలం, దేవపురం పంచాయితీ తుమ్మలపాలెం, సలుగు పంచాయితీ రెల్లమామిడి, చిలకలగొంది గ్రామాల్లో నాలుగు కొత్త పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసామన్నారు. అదే విధంగా జి మాడుగుల మండలంలో లువ్వాసింగి పంచాయితీ అలగం, వంతాల పంచాయితీ దుమ్ములమామిడి గ్రామాల్లో రెండు, చింతపల్లి మండలంలో బలపం పంచాయతీ చెరువూరులో ఒకటి కలపి మొత్తం ఏడు కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జెసి వివరించారు.

ఎఎస్‌పిని కలిసిన తిలక్



పుష్పగుచ్ఛం అందజేస్తున్న తిలక్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్ : పాడేరు అడిషనల్ సూపరెండెంట్ అఫ్ పోలీస్ (ఏఎస్‌పి) దీరజ్‌ను శుక్రవారం ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ దక్షిణ భారత కో ఆర్డినేటర్ ఎంవిఎస్ జి.తిలక్ కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ, చిన్న వయస్సులోనే ఐపిఎస్‌కు ఎంపికై ఆయన నేటి యువతకు ఆదర్శంగా నిలిచారన్నారు.

గాయపడిన జనసేన కార్యకర్తకు పరామర్శ

ప్రజాశక్తి-రంపచోడవరం

ప్రమాదంలో కాలు విరిగి రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని సిరిగిందలపాడు గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త కారం బ్రహ్మాజీని శుక్రవారం జనసేన పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లీగల్‌సెల్ ఉపాధ్యక్షులు కాకి స్వామి పరామర్శించారు. ఆయన కుటుంబానికి జనసేన శ్రేణులు ఆర్థిక సహాయాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు బొమ్మిశెట్టి రమణి, చారపు వెంకట రాయుడు, రాగల సురేష్, నర్సి ఎర్రయ్య, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స



మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: రాష్ట్ర ప్రభుత్వం మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని అల్లూరి జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సిపిఎం కార్యాలయంలో మండల కార్యదర్శి పాంగి భీమరాజు ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2019 ఎన్నికల ముందు జగన్ మోహన్ రెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టోలో ప్రతి జనవరికి ఒక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తానని హామీలు ఇచ్చి, నాలుగున్నర ఏళ్లలో కనీసం ఒక్క నోటిఫికేషన్ విడుదల చేయలేకపోవడం దుర్మార్గమన్నారు. మేనిఫెస్టోలో ప్రకటిచిన జాబ్ క్యాలండర్ ఏమైందని ప్రశ్నించారు.

గత 6నెలల క్రితం శాసన మండలి సమావేశంలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలు అడిగిన ప్రశ్నలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స నారాయణ సమాధానం ఇస్తూ.. త్వరలో డిఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 46 వేలు టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి నేటికి విడుదల చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిఈడి, డిఎడ్, టెట్ ఉత్తీర్ణతల పొంది ఉపాధ్యాయ పోస్టులకు అర్హత కలిగిన నిరుద్యోగుల యువత రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. నిరుద్యోగ యువత పోరాటాలు చేసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యుడు ఎంఎం శ్రీను, గల్లెల నారాయణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

జగనన్నకు చెబుదాంకు 172 విజ్ఞప్తులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి-అరకు లోయ: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రజలు తమ సమస్యలను విన్నపాల రూపంలో తగు పరిష్కారం కోసం కలెక్టర్ కు సమర్పించారు. రికార్డు స్థాయిలో 172 విన్నపాలు సమర్పించారు. ఇందులో అధిక శాతం డిఆర్డిఎ, పంచాయతి రాజ్, గృహ నిర్మాణ, ఆర్.డబ్ల్యుఎస్ శాఖలకు చెందిన దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలకు మరింత చేరువగా మెరుగైన సేవలు అందించడమే ధ్యేయమని, సమస్యలు అత్యంత దగ్గరగా పరిశీలించడానికి మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం స్పందన వేదికగా ఉందని చెప్పారు. సమస్యల పరిశ్కారానికి జిల్లా యంత్రాంగం వచ్చినందున సమస్యకు పరిష్కారం దొరుకుతుందనే నమ్మకంతో ప్రజలు విజ్ఞాపనలు సమర్పించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పరిష్కరించే దిశగా జిల్లా యంత్రాంగం కృషి చేయాలని సూచించారు.

ప్రతి సమస్యపై ఒక విచారణ అధికారిని నియమించి సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసి జే.శివ శ్రీనివాసు, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్, తహసిల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఓ సిహెచ్ వెంకటేష్, జెడ్పీటీసీ శెట్టి రోషిణి, ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

స్పందించని అధికారులపై కలెక్టర్ అగ్రహం

సమస్యలపై స్పందించని అధికారులపై అల్లూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అరకులోయలోజరిగిన స్పందన కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సుమిత్ కుమార్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్నకు చెబుదాం స్పందన పోర్టల్ లో వచ్చిన ఫిర్యాదులను చూడకపోవటం, చూసినా తగు చర్యలు తీసుకోకపోవడం పట్ల కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఇంకోసారి ఇలా జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి ఆర్థిక, ఆర్థికేతర ఫిర్యాదులను గుర్తించి నివేదించాలన్నారు. ఆర్థికేతర ఫిర్యాదులపై వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలను రెండు, మూడు సార్లు తిప్పించడం సరికాదని, ఇది బాధాకరమన్నారు. ప్రజల ఫిర్యాదుల పట్ల తగు రీతిలో స్పందించి, వారి సమస్యలను క్షుణంగా వినాలన్నారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నకిలీ ఎస్‌టి సర్టిఫికెట్ జారీపై ఫిర్యాదు

అరకులోయ: నకిలీ ఎస్టీ సర్టిఫికెట్ జారీపై అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కు ఆదివాసి గిరిజన సంఘం శుక్రవారం ఫిర్యాదు చేసింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాల్ దేవ్, మండల అధ్యక్షులు బుజ్జిబాబు, మండల నాయకులు జగన్నాథం, మగ్గనలు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బిసి(డి) కులానికి చెందిన గిరిజన నేతరుడు పిట్టల రాంబాబు, పిట్టల ప్రసాద్ లకు నకిలీ ఎస్టీ సర్టిఫికెట్ జారీపై అరకులోయ తహసిల్దార్ వేణుగోపాలరావు పై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

నకిలీ ఎస్టి సర్టిఫికెట్ జారీ చేసిన అధికారులపై, సర్టిఫికెట్ పొందిన గిరిజనేతరులపై కేసులు నమోదు చేసి క్రిమినల్ కేసులు పెట్టాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా తాత్సారం చేస్తున్నారని బాలదేవ్ తెలిపారు. ఇందుకు స్పందించిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నకిలీ ఎస్టీ సర్టిఫికెట్ జారీచేసిన ఇద్దరు అధికారులైన డిప్యూటీ తహసిల్దార్, వీఆర్వో ను సస్పెండ్ చేసామన్నారు. ఇందుకు బాధ్యుడైన తహసిల్దార్‌ను కూడా సస్పెండ్ చేయాలని ఆయన కలెక్టర్ ను కోరారు.

బైక్‌ను ఢీ కొన్న కారు

దంపతులతోపాటు ఇద్దరు పిల్లలకు తీవ్రగాయాలు



గాయపడిన బాధితులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ : మండలంలోని కురిడి సమీపంలోని అరుకు, పాడేరు ప్రధాన రోడ్డు వద్ద టూరిస్ట్ కారు బైక్‌ను ఢీ కొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో భార్య భర్తలతో పాటు మరో ఇద్దరు పిల్లలకు తీవ్ర గాయాలయ్యాయి. హుకుంపేట మండలం కొట్నపల్లి పంచాయతీ మత్స్యపురం గ్రామానికి చెందిన కొర్రా కృష్ణారావు తన భార్య, ఇద్దరు పిల్లలతో శుక్రవారం అరకు నుంచి తమ స్వగ్రామంలో ద్విచక్ర వాహనంలో వెళుతున్నారు. చాపరాయి జలపాతం నుంచి నుంచి అరకు వెళుతున్న టూరిస్ట్ కారు బైక్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలతో పాటు ఇద్దరు పిల్లలకు కూడా తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ఎస్సై సంతోష్ కుమార్ 108 అంబులెన్స్ లో క్షతగాత్రులను అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన టూరిస్ట్ కారును విడిచిపెట్టి పరారయ్యారు. ఈ సంఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలో మారుమూల ఇంజారి పంచాయతీ లో శుక్రవారం ఇంచార్జి ఎంపీడీఓ ఎల్ పూర్ణయ్య ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు, ఎంపీడీఓ మాట్లాడుతూ, పారామెడికల్ సిబ్బంది, గ్రామ వాలంటీర్స్ ఇంటింటా ప్రచారం నిర్వహించి టోకెన్స్ ఇవ్వడం జరిగిందన్నారు.

రంపచోడవరం: రంపచోడవరం గ్రామ పంచాయితీ పరిధిలో సచివాలయం -2లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న సర్పంచ్ మంగా బొజ్జయ్య మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజల ముంగిటకే వైద్య సేవలు అందిస్తూ వారికి తగిన మందులు ఇచ్చి మెరుగైన వైద్య సదుపాయం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, ఎంపిడిఓ బి.బాలకృష్ణ, ఈఓపిఆర్‌డి ఎన్.జాన్‌మిల్టన్, పంచాయితీ కార్యదర్శి ఎన్ రమేష్, సచివాలయ కార్యదర్శి నారాయణ రెడ్డి, వైద్యాధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపీపీ శారద

ప్రజాశక్తి- చింతపల్లి : ఐదు లక్షల రూపాయలు నిధులతో సిమెంటు రహదారి నిర్మాణం చేపట్టనున్నామని వైస్ ఎంపీపీ గోపి నాయక శారద అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తపాలెం పంచాయతీ భీమసింగి గ్రామంలో రహదారి సమస్య పరిష్కారానికి పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఈ మేరకు శుక్రవారం వైస్ ఎంపీపీ శారద శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యుడు సెగ్గే లక్ష్మి, సచివాలయ కన్వీనర్ బెన్నిబాబు, వైసిపి నాయకులు గోపి నాయక రంగారావు, సేగ్గే రామారావు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మూడు ఆటోలు సీజ్

ప్రజాశక్తి -అనంతగిరి: కనీస అనుమతులు, లైసెన్స్, రికార్డులు లేకుండా నడుపుతున్న మూడు ఆటోలను సీజ్ చేసి డ్రైవర్ లపై కేసు నమోదు చేశామని ఎస్సై కే.రాము తెలపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలోని డుముకు జంక్షన్ వద్ద శుక్రవారం వాహన తనిఖీ చేస్తుండగా నిమ్మలపాడు నుండి డుముకు మూడు ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడమే కాకుండా, ఇన్సూరెన్స్, రికార్డ్స్ లేకపోవడంతో ఆటోలను సీజ్ చేయడం జరిగిందన్నారు.



కోతులగుట్టలో కొమురం భీమ్ విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

కొమురం భీమ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - కూనవరం : ఆదివాసీ హక్కుల కోసం అలుపెరగని పోరాటాలు చేసి అమరుడైన విప్లవ యోధుడు కొమురం భీమ్ 83 వర్ధంతి సందర్భంగా కోతులగుట్టలో ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీ భావి తరాల మనుగడ కోసం, మన్యంలో ఆదివాసీలకు హక్కులు కోసం పోరాడిన తొలితరం నాయకుడు భీమ్ అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో యువతరం ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : కొమురం భీం 83వ వర్ధంతి దేవీపట్నం మండలం, దేవారం గ్రామ పంచాయితీ పరిధి పోతవరం గ్రామంలో ఆయన చిత్ర పటానికి ఆదివాసీ జేఏసీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెఎసి రాష్ట్ర వైస్ ఛైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ ఆదివాసీ భవిష్యత్ తరాలు కోసం జల్ జంగిల్ జమీన్, భూమి నీరు అడవి అధికారం మన్యంలో ఆదివాసులకే హక్కు అనే నినాదంతో అమాయక ఆదివాసులను చైతన్య పరచి అవిరామ పోరాటం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కారం రామన్న దొర, మడకం సుదీర్ కుమార్ దొర, తుర్రం బోసు దొర,మడి మణి కుమార్ దొర, తెల్లం సోమన్న దొర,కలుం సూర్య ప్రకాష్, కొమరం వెంకటేష్ దొర తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో అపెండిసైటిస్ ఆపరేషన్

ప్రజాశక్తి-రంపచోడవరం : స్థానిక ఏరియా హాస్పిటల్‌లో 24 గంటల నొప్పి (అపెండిసైటిస్) ఆపరేషన్ చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి 11గంటల సమయంలో రంపచోడవరం మండలం గిన్నెపల్లి గ్రామానికి చెందిన కోసు పెద్దబ్బాయి తీవ్ర నొప్పితో బాధపడుతూ ఏరియా ఆసుపత్రికి వచ్చారని, వెంటనే జనరల్ సర్జన్ డాక్టర్ సౌజన్య అది 24 గంటలు నొప్పిగా గుర్తించి శుక్రవారం ఉదయం ఆపరేషన్ చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ ఇటువంటి శస్త్ర చికిత్సలు ఎన్నో ఏరియా ఆసుపత్రిలో జరుగుతున్నాయని, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

సీలేరులో 'ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్'

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 6 గంటలకు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద సిఆర్‌పిఎఫ్ జి42 బెటాలియన్ డీఎస్పీ సురేష్, ఎస్ఐ రామకృష్ణ ప్రారంభించారు. ఇందులో భాగంగా పోలీస్ స్టేషన్ నుండి మెయిన్ బజార్, రామాలయం, ఏపీ జెన్కో చెక్‌పోస్టు, కళ్యాణ మండపం మీదుగా, తిరిగి పోలీస్ స్టేషన్‌కు రన్ చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి సురేష్ మాట్లాడుతూ ఈనెల 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని అక్టోబర్ 1 నుంచి 31 వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్ ఐదు కిలోమీటర్లు చేపట్టామన్నారు.

నేడు విశాఖకు ఉపరాష్ట్రపతి రాక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ శనివారం విశాఖకు రానున్నారు. ఆయనకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా మినిస్టర్ ఇన్ వెయిటింగ్ హోదాలో ఘన స్వాగతం పలకనున్నారు. శనివారం ఉదయం ఉప రాష్ట్రపతి ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం ఆంధ్రా మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొంటారు. ఐఎన్ఎస్ డేగాను సందర్శిస్తారు.

ఘనంగా ఎఎంసి శతాబ్ది ఉత్సవాలు



కళారూపాలతో ఆకట్టుకున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశంలోనే పురాతన వైద్య కళాశాలల్లో ఒకటైన ఆంధ్రా మెడికల్ కాలేజీ (ఎఎంసి) శతాబ్ది ఉత్సవాలు ఉత్సాహపూరిత వాతావరణంలో శుక్రవారం సాయంత్రం బీచ్ రోడ్డులోని ఆంధ్ర యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. వర్చువల్ విధానంలో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి మన్సుక్ మాండవీయ హాజరయ్యారు. తొలుత ఆయన కింగ్ జార్జ్ ఆసుపత్రిలో రూ.23.75 కోట్లతో నిర్మించనున్న 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎఎంసికి ఎంతో గొప్ప చరిత్ర ఉందన్నారు. ఆంధ్ర వైద్యకళాశాల నుంచి వచ్చే వైద్యులకు ప్రపంచ వ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందన్నారు. గడిచిన తొమ్మిదేళ్ల పాలనలో కేంద్రం వైద్య రంగంలో ఎన్నో మార్పులు తీసుకువచ్చిందన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని మాట్లాడుతూ ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ తమ ధ్యేయమన్నారు. అనంతరం సెంటినరీ సెలబ్రేషన్స్ సావనీర్‌ను విడుదల చేశారు. కార్యక్రమానికి ముందుగా వైద్యులు, వైద్య విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్సవాల్లో వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్, డాక్టర్ వైఎస్ఆర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ బాబ్జీ, మధ్యప్రదేశ్ ఆయుస్మాన్ భారత్ ముఖ్య కార్యదర్శి రమేశ్ కుమార్, ఎఎంసి సెంటినరీ సెలబ్రేషన్స్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ టి.రవిరాజు, విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, అనకాపల్లి ఎంపీ సత్యవతి, నార్త్ అమెరికా ప్రెసిడెంట్ మైనేని నాగేంద్ర, అంకోసా ప్రెసిడెంట్ కె.శశిప్రభ, ఎఎంసి ప్రిన్సిపాల్ బుచ్చిరాజు పాల్గొన్నారు.

విశాఖలో భగవంత్ కేసరి బృందం సందడి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : భగవంత్ కేసరి చిత్ర యూనిట్ శుక్రవారం విశాఖ నగరంలో సందడి చేసింది. షైన్ స్క్రీన్ బ్యానర్‌పై నందమూరి బాలకృష్ణ హీరోగా, కాజల్, శ్రీలీల ప్రధాన తారాగణంగా తెరకెక్కిన భగవంత్ కేసరి మూవీ 'షేర్ కా టూర్'లో భాగంగా విశాఖ మెలోడీ థియేటర్‌లో ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపేందుకు ఆ సినిమా బృందం తరలివచ్చింది. ఈ సందర్భంగా మీడియాతో చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ తన రెగ్యులర్ జోనర్ దాటి బాలయ్యతో తీసిన ఈ సినిమాకి పెద్ద పేరు రావడం ఆనందంగా ఉందన్నారు. కథ విన్న వెంటనే ఇద్దరు అమ్మాయిలు తండ్రి అయిన బాలకృష్ణ ఓకే చేశారని తెలిపారు. ఈ చిత్రంలో బాలయ్య జీవించారని కొనియాడారు. యాక్షన్ సన్నివేశాలు బాగా వచ్చాయని, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తీసిన సన్నివేశాలను అందరూ బాగా రిసీవ్ చేసుకున్నారని తెలిపారు. సినిమా సబ్జెక్ట్ ఆడపిల్లల తల్లిదండ్రులకు బాగా కనెక్ట్ అయ్యిందన్నారు. తనకు విశాఖతో ఎంతో మంచి అనుబంధం ఉందని, విశాఖలోనే అన్ని సినిమా కథలు రాసుకుంటానని గుర్తు చేసుకున్నారు. హీరోయిన్ శ్రీలీల మాట్లాడుతూ భగవంత్ కేసరి కంటెంట్ ఓరియంట్ సినిమా అని తెలిపారు. కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమానన్నారు. వరుసగా మూడు సినిమాలు హిట్ కావడం తనకు చాలా ఆనందంగా ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. నిర్మాత సాహు గరపాటి మాట్లాడుతూ ఈ చిత్రం ప్రేక్షకుల నమ్మకం నిలబెట్టుకుందన్నారు. నటుడు జి.సత్యసాయి శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలు కూడా పురుషులతో సమానమని తెలిపారు. శ్రీలీల పాత్ర మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు.

తరచూ మొరాయిస్తున్న యూనియన్ బ్యాంకు ఎటిఎం

డబ్బులు కోసం ఇబ్బంది పడుతున్న ఖాతాదారులు



ఎటిఎం వద్ద నిరాశగా ఖాతాదారులు

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం సీలేరులోని యూనియన్ బ్యాంక్ ఏటీఎం తరచూ మొరాయిస్తుంది. దీంతో ఖాతాదారులు డబ్బులు కోసం ఇబ్బందులు గురవుతున్నారు. ఈ యూనియన్ బ్యాంకులో దారకొండ, గుమ్మిరేవులు, దుప్పిలివాడ, సీలేరు పంచాయతీ పరిధిలోని ప్రజలు, ఎపి జెన్‌కో ఉద్యోగులు ఖాతాదారులుగా ఉన్నారు. వీరంతా ఏ చిన్న అవసరం వచ్చినా ఈ ఎటిఎం నుండే డబ్బులు డ్రా చేసుకుంటారు. అయితే తరచూ ఈ ఎటిఎం మొరాయిస్తుండడంతో అత్యవసర సమయాల్లో డబ్బులు కోసం అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వారం రోజులు నుంచి ఏటీఎం పనిచేయడం లేదు. ఏటీఎం మరమ్మతులకు గురైందని యూనియన్ బ్యాంక్ సిబ్బందికి సమాచారం అందించినా సకాలంలో స్పందించడం లేదని ఖాతాదారులు వాపోతున్నారు. తక్షణమే ఏటీఎంకు మరమ్మతులు నిర్వహించి అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా బ్యాంకు మేనేజర్ చర్యలు చేపట్టాలని ఖాతాదారులు డిమాండ్ చేస్తున్నారు.



సీలేరులో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

పలుచోట్ల 'పోలీసు ఓపెన్ హౌస్'

ప్రజాశక్తి-సీలేరు : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో భాగంగా జీకే వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఎస్సై జె.రామకృష్ణ ఆధ్వర్యాన ఓపెన్ హౌస్ ప్రోగ్రాం నిర్వహించారు. సీలేరు డిఎవి పాఠశాల విద్యార్థులకు పోలీసుల విధి నిర్వహణ, ఆయుధాలు పనితీరు, పోలీసుల రక్షణ చర్యలు, విధినిర్వహంలో శత్రువులను ఏ విధంగా ఎదుర్కొంటారు తదితర అంశాలపై ఎస్ఐ రామకృష్ణ వివరించారు. విద్యార్థులు ఉన్నతమైన శిఖరాలకు అవరోధించి భారతదేశాన్ని కాపాడే విధంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిఎవి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోతుగూడెం : అల్లూరి సీతారామరాజు జిల్లా, వై.రామవరం మండలం డొంకరాయి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న బాబూ నగర్, విల్లర్ధి గ్రామాల్లో ఎస్సై శివ కుమార్ పోలీసు విధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు శ్రీను, నాగరాజు, పోసయ్య, కన్నప్పరెడ్డి పాల్గొన్నారు.

చింతపల్లి: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసులు ఉపయోగించే ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించామని స్థానిక ఏ ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పది రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ రమేష్, ఎస్సైలు అరుణ్ కిరణ్, వెంకటరమణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు



చలపతిరావు పార్థివదేహం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

గుండెపోటుతో ఉపాధ్యాయుడు చలపతిరావు మృతి

ప్రజాశక్తి - విఆర్.పురం : ప్రముఖ ఉపాధ్యాయుడు చలపతిరావు (55) గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. విఆర్.పురం మండలం, రామవరం గ్రామానికి చెందిన చలపతిరావు మండలంలోని నూతిగూడెం జిపిఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్నారు. చలపతిరాజుకు శుక్రవారం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు చికిత్స కోసం కోతులగుట్ట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చలపతిరావు తుదిశ్వాస విడిచారు. చలపతిరావు మృతదేహాన్ని ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, సుబ్బారావు, వాళ్ల కృష్ణారెడ్డి, యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు సందర్శించి నివాళులర్పించారు. చలపతిరావు అకాల మరణం పట్ల వారు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.